11-04-2025
శుక్రవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 201 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# రేపటి పౌరుల భవితను నిర్మించే.. బాధ్యత మేం తీసుకున్నాం

యంగ్ ఇండియా.. ఇది రేవంత్ బ్రాండ్.. పోలీస్ స్కూల్.. పోలీస్ ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల. దేశంలోనే తొలిసారి. సైనిక్ స్కూల్స్ తరహాలో.. అన్నిరకాల వసతులు, అత్యాధునిక సౌకర్యాలతో పర్‌ఫెక్ట్ స్కూల్. హైదరాబాద్ శివారు మంచిరేవులలో మొదటి పోలీస్ స్కూల్‌ను ప్రారంభించారు సీఎం రేవంత్‌రెడ్డి. త్వరలోనే ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పోలీస్ స్కూల్ కోసం 100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేయనున్నారు.

- ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ మా జెండా.. అజెండా
- యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10 :**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టే.. ఇప్పుడు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేసి పోలీస్ కుటుంబాలకు బహుమతిగా ఇస్తున్నామన్నారు ముఖ్యమంత్రి.యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఓపెనింగ్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కిలో బియ్యం రెండు రూపాయలకే ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది, హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుది, ఆరోగ్యశ్రీని తీసుకొచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. అలాగే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అంటే అందరికీ నేనే గుర్తొస్తా. ఇదే నా బ్రాండ్. కొందరు తెలంగాణ ఉద్యమాన్ని తమ బ్రాండ్‌గా చెప్పుకొని పైశాచిక ఆనందం పొందుతున్నారు. రాష్ట్రంలో ఏటా లక్షలాది మంది బీటెక్ పూర్తి చేస్తున్నారు. విద్యార్థుల్లో నాణ్యత ఎంతంటే ఎవరి దగ్గరా సమాధానం లేదు.బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు కనీసం అప్లికేషన్లు కూడా నింపలేకపోతున్నారు. విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేందుకే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ తీసుకొస్తున్నాం. త్వరలో ప్రభుత్వ స్కూళ్లలో కూడా ప్రీ స్కూల్ విధానం ప్రారంభిస్తాం. దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా ఏర్పాటు చేస్తాం. క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. ఒలంపిక్స్‌లో చిన్న చిన్న దేశాలు మెడల్స్ సాధిస్తున్నాయి. మనం దేశం ఎందుకు సాధించలేకపోతుందో ఒకసారి ఆలోచించాలి. పోలీస్ స్కూల్ అంటేనే ఓ బ్రాండ్‌గా తయారు కావాలి.' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నామన్నారు. ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని.. అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది తమ ప్రభుత్వ బ్రాండ్ అన్నారు. నిరుద్యోగులకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా

...మిగతాది 2 లో

# బంగ్లాదేశ్ కు భారత్ షాక్...




**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:**
బంగ్లాదేశ్ లో కొత్త ప్రభుత్వం భారత వ్యతిరేక విధానాలు పాటిస్తోంది. దీంతో భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ కు షాక్ ట్రీట్ మెంట్ ఇచ్చింది. ఇకపై భారత భూభాగం మీదుగా బంగ్లాదేశ్ ఇతర దేశాలకు చేసే ఎగుమతులకు అనుమతిని రద్దు చేసింది. ఒక దేశం పక్క దేశం భూభాగం మీదుగా ఇతర దేశాలకు ఎగుమతులు చేసే ప్రక్రియను ట్రాన్స్‌షిప్‌మెంట్ అని అంటారు.భారత ప్రభుత్వం.. బంగ్లాదేశ్‌కు ఇస్తున్న ముఖ్యమైన ట్రాన్స్‌షిప్‌మెంట్ సదుపాయాన్ని రద్దు చేసినట్టు ప్రకటించింది. 2020లో బంగ్లాదేశ్‌కు ఈ సదుపాయాన్ని భారత ప్రభుత్వం అందించింది. దీని ద్వారా బంగ్లాదేశ్ తన ఎగుమతి సరుకులను భారతదేశంలోని భూభాగం మీదుగా ఉన్న ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లను ఉపయోగించి భారత ఓడరేవులు, విమానాశ్రయాలకు పంపించి, అక్కడి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు అలా కుదరదని ఇండియా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వచ్చింది.ఈ ట్రాన్స్‌షిప్‌మెంట్ సదుపాయం ద్వారా బంగ్లాదేశ్ తన సరుకులను నేపాల్, భూటాన్ వంటి దేశాలకు వేగంగా, తక్కువ ఖర్చుతో రవాణా చేయగలిగేది. అయితే భారత ప్రభుత్వం ఈ సదుపాయాన్ని నిలిపివేయడానికి అనేక కారణాలను పేర్కొంది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పిన ప్రకారం.. బంగ్లాదేశ్ కు ఈ సదుపాయం ఉండడంతో ఆ దేశం ఎగుమతుల కారణంగా భారత దేశంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు అధిక రద్దీ సమస్య ఎదురవుతోంది. దీని వల్ల సరుకు

...మిగతాది 2 లో



# తెలంగాణలో 604 కొత్త బ్రాండ్లు



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:**
దేశంలో ఎక్కువ మద్యం అమ్మకాలు, సేవించే రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ప్రభుత్వ ఆదాయానికి కీలక వనరుగా మారింది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ సర్కార్ కూడా ప్రజలతో ఎక్కువ మద్యం తాగించాలని చూస్తోంది. ఈమేరకు కొత్త బ్రాండ్లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే త్వరలోనే కొత్త బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి.తెలంగాణ మద్యం మార్కెట్‌లో కొత్త బ్రాండ్ల ఆగమనానికి మార్గం సుగమమవుతోంది. అబ్కారీ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు రాగా, వీటిలో ఇండియన్, విదేశీ బ్రాండ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ బేవరేజ్ కార్పోరేషన్ లిమిటెడ్ కొత్త బ్రాండ్ల అమ్మకాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. అదే సమయంలో, వైన్ షాపులు మరియు బార్ల మధ్య వివాదం కూడా రాజుకుంది, రెండు వర్గాలూ ఆదాయం, నిబంధనలపై ఆరోపణలుప్రత్యారోపణలతో వాతావరణాన్ని వేడెక్కించాయి. ఈ కథనం ఈ అంశాలను వివరంగా చర్చిస్తుంది.తెలంగాణ అబ్కారీ శాఖ ప్రకారం, మొత్తం 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు సమర్పించబడ్డాయి. వీటిలో 331 ఇండియన్ మేడ్ లిక్కర్ బ్రాండ్లు, 273 విదేశీ లిక్కర్ బ్రాండ్లు ఉన్నాయి. ఈ దరఖాస్తుల్లో 47 కొత్త కంపెనీల నుంచి 386 బ్రాండ్లు,

...మిగతాది 2 లో



# పీ4 పథకంతో కుటుంబాల దత్తత

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా థింక్ ట్యాంక్ ను ఏర్పాటు చేసుకుంటారు. వారు అనేక రకాలుగా ఆలోచించి ఇటు ఓటు బ్యాంకు పెరిగి రాజకీయంగా పార్టీ బలోపేతం అవ్వడమే కాకుండా చంద్రబాబు పాలనకు మంచి మార్కులు జనంలో పడేలా అన్ని రకాలుగా ఆలోచించి తగిన పథకాలను రూపొందిస్తారు.**



**జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 10:**
థింక్ ట్యాంక్ రూపొందించిన వాటిలో వర్క్ అవుట్ అయ్యేవి మాత్రమే చంద్రబాబు అందిపుచ్చుకుంటారు. అందులో నుంచి ఈ ఏడాది వచ్చిందే పీ4 పథకం. పేదరిక నిర్మూలన కోసం ఈ పథకాన్ని తెచ్చారు. సంపన్నులు పది శాతం ఉంటే పేదరికం ఎక్కువ శాతం

...మిగతాది 2 లో

# పవన్ పై కవిత కామెంట్స్

- మండిపడుతున్న జనసైనికులు



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:**
**"అన్ ఫార్చునేట్లీ హి బికేమ్ ఎ డిప్యూటీ సీఎం.."**
**"హి ఈజ్ నాట్ ఎ సీరియస్ పొలిటీషియన్ "**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ని ఉద్దేశించి బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలివి. పవన్ కల్యాణ్ ని కించపరిచేలా ఆయన స్థాయిని తగ్గించేలా కవిత మాట్లాడారు. దీంతో జనసైనికులకు కోపం వచ్చింది. కవితను ఓ రేంజ్ లో ట్రోల్ చేస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ గురించి వీడియోలు వైరల్ చేస్తున్నారు. కవిత అరెస్ట్ అయినప్పటి వీడియోలు బయటకు తీసి.. సీరియస్ పొలిటీషియన్ అంటే ఇలా స్కామ్ లు చేసి అరెస్ట్ కావాలేమో అంటూ కౌంటర్లిస్తున్నారు. కేసీఆర్ కూతురిగా వారసత్వ రాజకీయాలతో నెట్టుకొస్తున్న కవి, ఇప్పుడు కూడా

...మిగతాది 2 లో



# భారతిపై కామెంట్స్ సారీ చెప్పిన కిరణ్

**జయభేరి, కడప, ఏప్రిల్ 10:**
సోషల్ మీడియా పుణ్యమా అంటూ నోటికి హద్దూ అదుపూ లేకుండా పెట్రేగి పోతున్న బ్యాచ్‌ని మనం చూస్తున్నాం. పొలిటికల్ సర్కిల్లో అయితే ఇది మరింత విచ్చలవిడిగా తయారైంది.

...మిగతాది 2 లో

# అందుబాటులోకి ఆధార్ కొత్త యాప్




**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:**
ఇకపై ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన పనిలేదు. ఈ మేరకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) త్వరలో కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు

...మిగతాది 2 లో

# ప్రమాదంలో ఆరోగ్యం

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బాధ్యత మేం తీసుకున్నాం

స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి.. ఆనంద్ మహేంద్రను చైర్మన్‌గా నియమించ మన్నారు. దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దుతామని తెలిపారు సీఎం. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారని.. కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారని.. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయని అన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా.. పిల్లలతో కలిసి కాసేపు ఉత్సాహంగా ఫుట్ బాల్ ఆడారు సీఎం రేవంత్ రెడ్డి.

## బంగ్లాదేశ్ కు భారత్ షాక్...

రవాణాలో ఆలస్యం ఏర్పడుతున్నది. దీంతో పాటు భారత ఎగుమతుల వ్యయం కూడా పెరుగుతోంది. ఈ రద్దీ భారత ఎగుమతులకు ఆటంకంగా మారడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.అయితే ఈ నిర్ణయం వెనుక రాజకీయ పూర్వాపరాలు కూడా ఉన్నాయని కొంతమంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ ఇటీవల చైనాలో పర్యటించారు. ఆ సందర్భంగా భారత ఈశాన్య ప్రాంతాన్ని ల్యాండ్‌లాక్డ్ ప్రాంతంగా వ్యాఖ్యానిస్తూ, ఆ ప్రాంతంలో చైనా ఆర్థిక ప్రభావాన్ని విస్తరించాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు భారత ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయని, అందుకే ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం ట్రాన్స్‌షిప్‌మెంట్ సదుపాయాన్ని రద్దు చేసిందని విశ్లేషకులు అంటున్నారు.భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయం బంగ్లాదేశ్ ఎగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా అక్కడి రెడీమేడ్ గార్మెంట్ పరిశ్రమ దీనివల్ల గణనీయంగా నష్టపోవచ్చని అంచనా. ఈ సదుపాయం లేకపోవడం వల్ల బంగ్లాదేశ్ ఎగుమతిదారులు రవాణా ఆలస్యాలు, అధిక ఖర్చులు, వ్యాపారంలో అనిశ్చితి వంటి సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా నేపాల్, భూటాన్, మయన్మార్ వంటి దేశాలతో బంగ్లాదేశ్ చేస్తున్న వ్యాపారం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికే అమెరికా విధించిన అధిక సుంకాల వల్ల ఇబ్బందుల్లో ఉన్న బంగ్లాదేశ్‌కు ఇది మరో పెద్ద ఆర్థిక సమస్యగా మారింది.ఈ సందర్భంగా అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ, ఈ నిర్ణయం ఈశాన్య భారత భద్రతను పరిరక్షించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిబద్ధతను చాటుతుందని అన్నారు. బంగ్లాదేశ్ ట్రాన్స్‌షిప్‌మెంట్ రద్దు నిర్ణయాన్ని భారత దుస్తుల పరిశ్రమ కూడా స్వాగతించింది. అయితే ట్రాన్స్‌షిప్‌మెంట్ సదుపాయం రద్దు కావడం వల్ల భారత్ – బంగ్లాదేశ్ వాణిజ్య సంబంధాలపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. ఇది రెండు దేశాల మధ్య ఉనికిలో ఉన్న దౌత్య సంబంధాలలో ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తుంది. ఇకపై బంగ్లాదేశ్ తమ ఎగుమతుల కోసం కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఏర్పడినంది.

## పవన్ పై కవిత కామెంట్స్

ఎమ్మెల్సీ అయ్యారని, పార్టీ పేరు చెప్పి ఆమె రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు జనసైనికులు. బీఆర్ఎస్ ఎప్పుడూ వైసీపీకి మద్దతిస్తుందనే విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ పార్టీ నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని విమర్శిస్తుంటారు. తాజాగా కవిత కూడా సందర్భం లేకుండా పవన్ ని విమర్శించడానికి కారణం ఇదే నంటున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పై తమకున్న అక్కసునంతా ఆమె ఇలా బయటకు చూపెడుతున్నారని చెబుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా బీఆర్ఎస్ సీరియస్ గా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏడాదిలోగా ఎన్నికలొస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతోకాలం నిలబడదని అనేవారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా ఇటీవల కవిత విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. కవిత వ్యాఖ్యల్ని అక్కడ కాంగ్రెస్ నేతలు కూడా తీవ్రంగా ఖండించారు. అదే సమయంలో ఇటు ఏపీ రాజకీయాలపై కూడా ఆమె చేసిన వ్యాఖ్యలు, పవన్ ని కించపరిచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు జనసైనికులు.అనవసరంగా పవన్ కల్యాణ్ పై కామెంట్స్ చేసి, జనసైనికుల్ని రెచ్చగొట్టిన కవిత.. ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోలింగ్ మెటీరియల్ గా మారారు. కవిత లిక్కర్ స్కామ్ వీడియోలను వెలికితీసి మరీ కౌంటర్లిస్తున్నారు. కవిత జైలుకెళ్లడాన్ని ట్రోల్ చేస్తున్నారు. కవిత చేసిన స్కామ్ వల్లే ఇక్కడ బీఆర్ఎస్, అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ.. రెండూ అధికారానికి దూరమయ్యాయని అంటున్నారు. మొత్తమ్మీద కవిత ఏరికోరి ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోలింగ్ కి గురైనట్టు తెలుస్తోంది. అనవసరంగా ఆమె జనసైనికుల్ని రెచ్చగొట్టారని, ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నారని అంటున్నారు నెటిజన్లు.

## పీ4 పథకంతో కుటుంబాల దత్తత

ఉంది కాబట్టి వారిని ఆదుకునేందుక ఈ పథకాన్ని తెచ్చారు.మొన్న ఉగాది నాడు పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు అమరావతిలో ప్రారంభించారు. అయితే ఆశించిన రీతిలో ఇప్పటి వరకూ పెద్దగా రెస్పాన్స్ రాకపోవడంతో చంద్రబాబు పీ4 పథకానికి సంపన్నులు ఆకట్టుకునేలా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులతో పాటు తనకు సుదీర్ఘకాలం నుంచి సహకారం అందిస్తూ వస్తున్న పారిశ్రామిక వేత్తలకు అప్పగించారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి కనీసం ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆన్ లైన్ ద్వారా సంపన్నులు నేరుగా పేదలను ఆదుకునేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.నియోజకవర్గాల వారిలో ప్రధానంగా సంపన్నులను గురించి పీ4 పథకానికి సాయం అందించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ వంతుగా ప్రయత్నం చేయాలని కోరారు. ఇది ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని ప్రజాప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఉగాది పండగ నాటికి ఎంత మేర బంగారు కుటుంబాలకు లబ్ది జరిగింది? సంపన్నుల పేర్లతో పాటు పారదర్శకంగా వివరాలను వెల్లడించి ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా అవసరమైన చర్యలు సత్వరం ప్రారంభించాలని గట్టిగా కోరారు. ఒక పథకం విజయవంతం కావాలంటే తొలుత మనం శ్రమించాలని, తర్వాత పథకం దానంతట అదే విస్తృతంగా డెవెలెప్ అవుతుందని చంద్రబాబు గట్టిగా నమ్ముతున్నారు.ముఖ్యంగా పేదరికంలో మగ్గుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని బంగారు కుటుంబాల కింద ఎంపిక చేస్తే వారు కూడా పార్టీ జెండా దించకుండా మరింతగా రాజకీయంగా ఉపయోగపడతారని చంద్రబాబు వేస్తున్న అంచనాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. దీంతో పాటు వచ్చే ఏడాది కూడా మరో కొత్త పథకంతో జనం ముందుకు రావాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు థింక్ ట్యాంక్ నాలుగైదు పథకాలకు రూపకల్పన చేసినట్లు సమాచారం.

## అందుబాటులోకి ఆధార్ కొత్త యాప్

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ యాప్ ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి ఫీచర్ల ఆధారంగా పనిచేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్త ఆధార్ మొబైల్ యాప్‌ను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎంఆధార్ యాప్‌తో పోలిస్తే రీడిజైన్ చేసిన ఇంటర్‌ఫేస్‌ను ఇది కలిగి ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రస్తుతం కొత్త యాప్ బీటా టెస్టింగ్ దశలో ఉందని, త్వరలో దేశవ్యాప్తంగా డిజిటల్ ఆధార్ కార్డ్ అందుబాటులోకి రానున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కొత్త యాప్‌లో, మొత్తం ప్రక్రియ ముఖ ప్రామాణీకరణ సహాయంతో జరుగుతుందని మంత్రి అన్నారు. మంత్రి అశ్విని వైష్ణవ్ X ప్లాట్‌ఫామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు, అందులో ఆయన స్వయంగా కొత్త ఆధార్ యాప్ గురించి వివరించి ఒక చిన్న వీడియోను పోస్ట్ చేశారు. ఆయన కొత్త ఆధార్ యాప్, మొబైల్ యాప్ ద్వారా ఫేస్ ఐడి ప్రామాణీకరణ గురించి చెప్పారు. దీనితో పాటు అతను తొమ్మిది భౌతిక కార్డులు తొమ్మిది ఫోటోకాపీలు వంటి పదాలను ఉపయోగించారు.వెరిఫికేషన్ సమయంలో ఆధార్ యాప్‌తో స్కాన్ చేయడం ద్వారా సులభంగా పూర్తి చేయవచ్చు. ప్రస్తుతం యూపీఐ లాంటి చెల్లింపుల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న తరహాలోనే ఇది కూడా పని చేయనున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల అత్యంత సురక్షితంగా, సులభంగా ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని మంత్రి వెల్లడించారు. కొత్త యాప్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నుంచి ప్రజలు తమ మొబైల్ ఫోన్ నుంచి ఆధార్‌ను షేర్ చేసుకోవచ్చని తెలిపారు. ఇది అన్ని చోట్ల, అన్ని పనులకు ఉపయోగించవచ్చని, చేతిలో ఆధార్ కార్డును పట్టుకెళ్లాల్సిన పని ఉండదని మంత్రి స్పష్టం చేశారు.
కొత్త ఆధార్ యాప్ ద్వారా ఫేస్ ఐడి, క్యూఆర్ స్కానింగ్ ద్వారా డిజిటల్ వెరిఫికేషన్ జరుగుతుంది. కొత్త ఆధార్ యాప్ తో వినియోగదారుల అనుమతి లేకుండా డేటా షేర్ చేయడం జరగదు, గోప్యత పెరుగుతుంది. ధృవీకరణ కోసం ఫోటోకాపీని అందించాల్సిన అవసరం ఉండదు. హోటళ్ళు, విమానాశ్రయాలలో ఫోటోకాపీలను అందించాల్సిన అవసరం ఉండదు.

# భారత్-అమెరికా కొత్త ఫార్ములా..

**టారిఫ్స్.. ప్రపంచ వ్యాప్తంగా కల్లోలం సృష్టిస్తున్న వన్ అండ్ ఓన్లీ వర్డ్ ఇది. ట్రంప్ యాక్షన్‌కు చైనా వంటి దేశాలు ప్రతీకారానికి దిగడం ప్రపంచాన్ని కలవరపెడుతోంది. ఈ వాణిజ్య యుద్ధం.. ఎక్కడ ఆర్థిక మాంద్యంగా మారుతుందో అన్న ఆందోళనలే చాలా దేశాల్లో కనిపిస్తున్నాయి. మరి డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్‌పై భారత్ రియాక్షన్ ఏంటి?.. చైనా చేసినట్టు ప్రతీకార పన్నులకు దిగుతుందా? లేక ట్రంప్‌కు తలవంచి సర్దుకుపోతుందా? అంటే ఈ రెండూ కాదు.. అంతకుమించిన ఫార్ములాను తెరపైకి తెచ్చింది.**



ఆ ఫార్ములా కనుక వర్క్‌ఔట్ అయితే ట్రంప్ టారిఫ్స్ ప్రభావం మన దేశంపై ఉండకపోగా.. వాణిజ్యంలో సరికొత్త లక్ష్యాలను చేరుకోవడం ఈజీ అవుతుంది. పైగా ఆ ఫార్ములాను జైశంకర్ హ్యాండిల్ చేస్తున్నారు. కాబట్టి ఫెయిల్ అయ్యే ఛాన్స్ కూడా ఉండకపోవచ్చు. ఇంతకూ, ట్రంప్ టారిఫ్స్ టెర్రర్ పుట్టిస్తున్న వేళ.. భారత్‌అమెరికా అమలు చేయబోతున్న ఫార్ములా ఏంటి 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై రష్యా దండెత్తింది. అప్పుడు ప్రపంచం రెండుగా చీలింది. ఉక్రెయిన్, రష్యాలో ఎవరు ఎవరివైపు అనే ప్రశ్న తలెత్తింది. కొన్నిదేశాలు ఉక్రెయిన్ వైపు నిలిస్తే.. మరి కొన్ని దేశాలు రష్యా వైపు నిలబడ్డాయి. భారత్ మాత్రం ఎవరివైపూ నిలబడలేదు. తన సిద్ధాంతం శాంతి మాత్రమే అని తేల్చి చెప్పింది. కీవ్‌వైపు నిలవాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెచ్చినా డోంట్ కేర్ అంటూ..అదే మాటపై నిలబడింది. మొదట్లో భారత్ ధైర్యం ఏంటో ప్రపంచ దేశాలకు అర్థం కాలేదు. ఆ తర్వాత మాత్రం భారత్ నిర్ణయమే భేష్ అని ప్రపంచమే అంగీకరించింది. తొందర పడి ఏదో ఒక నిర్ణయం తీసు కుని, గుడ్డిగా ఎవరో ఒకరి పక్షాన నిలవడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ప్రపంచానికి అర్థమైంది. ఇప్పుడు ట్రంప్ టారిఫ్స్ విషయంలో కూడా భారత్ అంతే కూల్‌గా వ్యవహరిస్తోంది. 26శాతం టారిఫ్స్ ప్రకటించగానే తొందరపడి ప్రతీకార పన్నులు ప్రకటించలేదు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఇప్పుడు ఆ మార్గాలే భారత్‌ను బెటర్ పొజిషన్‌లో నిలబెట్టబోతున్నాయి.ట్రంప్ విధించిన టారిఫ్‌లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్న

**ఆస్ట్రేలియా, మారిషస్, యూఏఈ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇక బ్రిటన్, కెనడా, యూరోపియన్ యూనియన్, ఇజ్రాయెల్‌తో కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ దేశాల సంగతెలా ఉన్నా.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫైనల్ అయితే.. అది భారత్‌కు గేమ్ ఛేంజింగ్ మూమెంట్ అవుతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం.**

వేళ భారత్ చేస్తున్న భిన్నమైన ఆలోచనలకు సాక్ష్యమే ఈ ట్వీట్. అగ్రరాజ్యంపై పరస్పర సుంకాలకు బదులుగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై మోడీ సర్కార్ దృష్టిసారించింది. దీనిపై ఇరుదేశాల విదేశాంగ మంత్రులు జైశంకర్, మార్కో రూబియో ఫోన్‌లో కీలక చర్చలు జరిపారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి త్వరగా ఆమోదం తెలపాలని ఇరుపక్షాలు అంగీకారానికి వచ్చాయి. ఈ విషయాన్నే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సోషల్ మీడియాలో వెల్లడించారు. “అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో ఫోన్‌లో మాట్లాడా. ఇండోపసిఫిక్, భారత ఉపఖండం, యూరప్, మధ్య ఆసియా, పశ్చిమాసియా, కరేబియన్‌లో నెలకొన్న పరిస్థితులపై చర్చలు సాగించాం. భారత్‌అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా చేసుకోవాల్సిన ఆవశ్యకతపై ఏకాభిప్రాయానికి వచ్చాం. దీనిపై మరిన్ని సంప్రదింపులు కొనసాగించేందుకు ఎదురుచూస్తున్నాం అని జైశంకర్ రాసుకొచ్చారు.అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పూర్తయితే ట్రంప్ టారిఫ్స్.. మనకు వరంగా మారే అవకాశాలే అధికంగా ఉంటాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అంటే.. రెండు దేశాలు పరస్పర అంగీకారంతో దిగుమతులు, ఎగుమతులపై సుంకాలను తగ్గించే డీల్. దీని వల్ల వాణిజ్యానికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. వివరంగా చెప్పాలంటే.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే, రెండువైపులా చాలా ఉత్పత్తులపై సుంకాలు తగ్గిపోతాయి, లేదంటే రద్దు అవుతాయి. కొన్ని ప్రత్యేక ఉత్పత్తులపై మాత్రమే సుంకాలు కొనసాగొచ్చు. దీని వల్ల భారత్, అమెరికా టారిఫ్ వార్ సమస్య పరిష్కారమవుతుంది. ఇకపై అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులు చౌకగా లభిస్తాయి. అదే విధంగా, భారత్ నుంచి అగ్రరాజ్యానికి ఎగుమతి చేసే ఉత్పత్తులు, సేవలు కూడా మరింత పోటీ ధరలతో అందుబాటులోకి వస్తాయి. దీని వలన భారతీయ తయారీ రంగం, సేవా రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశముంది. ఇప్పటికే మన దేశం.. ఆస్ట్రేలియా, మారిషస్, యూఏఈ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇక బ్రిటన్, కెనడా, యూరోపియన్ యూనియన్, ఇజ్రాయెల్‌తో కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ దేశాల సంగతెలా ఉన్నా.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫైనల్ అయితే.. అది భారత్‌కు గేమ్ ఛేంజింగ్ మూమెంట్ అవుతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. అందుకు చాలా బలమైన కారణాలున్నాయి.చైనా, యూరోపియన్ యూనియన్‌పై అమెరికా ఆర్థిక యుద్ధం చేస్తే, ఆ పరిణామం భారత్‌కు వరంగా మారే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ ట్రేడ్ వార్ బడా సంస్థలు భారత్‌కు వచ్చేలా చేస్తుంది. చైనా ఆల్రెడీ.. అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య యుద్ధంలో ఉంది. అటు యూరోపియన్ యూనియన్ కూడా చైనాకు ప్రత్యామ్నాయం కోసం భారత్‌తోనే సంప్రదింపులు చేస్తోంది. ఈ పరిణామాలు మన దేశ వాణిజ్యానికి కలిసొచ్చే అంశాలే. చైనాను మరిన్ని కష్టాల్లోకి నెట్టేయబోతోంది కూడా ఈ పరిణామాలే. ఓవరాల్‌గా ఒక్కటి మాత్రం నిజం.. సంక్షోభాలు ఎదురైనప్పుడు తొందరపాటు చర్యలతోకాక.. సామరస్యంగా నిర్ణయాలు తీసుకుంటే ఫలితాలు పాజిటివ్‌గా వస్తాయని భారత్ మరోసారి ప్రపంచానికి చాటబోతోంది.

## భారతిపై కామెంట్స్

గత ఎన్నికల్లో వైసిపి ఓటమి పాలు అయిందంటే ఇలా సోషల్ మీడియా అబ్యూజ్ కూడా ఒక కారణమే. ఇప్పుడు మేం మాత్రం తక్కువా అంటున్నారు కొంతమంది టిడిపి అభిమానులు. ఇదిగో అలాంటి విపరీత కామెంట్స్ తో తీవ్రంగా ట్రోల్ అవుతున్నాడు చేబ్రోలు కిరణ్ కుమార్ అనే టిడిపి అభిమాని.ఎన్నికల ముందు నుంచి చేబ్రోలు కిరణ్ కుమార్ అనే టిడిపి అభిమాని తెలుగుదేశానికి మద్దతుగా వీడియోలు చేస్తూ వస్తున్నాడు. కామన్ మ్యాన్ కిరణ్ పేరుతో సోషల్ మీడియాలో బాగానే పాపులర్ అయ్యాడు. అయితే ఇటీవల మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి భార్య YS భారతిపై రాయడానికి వీలు లేని విధంగా విమర్శలు చేశాడు కిరణ్. ఇటీవల జగన్ మోహన్ రెడ్డి పోలీసులపై విమర్శలు చేస్తూ "బట్టలూడదీస్తా" అనే మాటకు కౌంటర్‌గా కిరణ్ ఆయన సతీమణిని టార్గెట్ చేశాడు. దీనితో ఒక్కసారిగా అతనిపై భగ్గుమన్నారు వైసీపీ మద్దతుదారులు. దీనిపై స్పందించిన టీడీపీ NRI విభాగం స్పోక్స్ పర్సన్ చెంచు వేణుగోపాల్ రెడ్డి.. "అతను మా పార్టీ అయితే కచ్చితంగా యాక్షన్ తీసుకుంటాం. మా టీడీపీలో ఇలాంటి క్యారెక్టర్ లెస్ మాటలకు స్థానం ఉండకూడదు అని మా పెద్దాయన చంద్రబాబు, లోకేష్ చెబుతున్నారు. అదే మేము ఫాలో అవుతున్నాం. ఇతని మాటలు కచ్చితంగా ఎవ్వరూ అంగీకరించరు. ఇలాంటి భాష మాట్లాడుతున్నాడంటే ఇతని మానసిక స్థితి ఏమిటో అర్థమవుతుంది.నాలుగు బూతులు మాట్లాడి, నలుగురిని తిడితే యూట్యూబ్ వ్యూస్ వస్తాయనుకునే యూట్యూబర్ ఈ కుర్రాడు. యూట్యూబ్ ఛానెల్స్‌కి సెన్సార్ బోర్డు లేకపోవడంతో ఇలాంటి వాళ్లు నోరు జారుతున్నారు .ఈ రోజు నువ్వు అన్నావు, రేపు వాళ్లు అనారా? ఏంటి ఇలాంటి మాటల వల్ల ఉపయోగం? కొంచెం నోరు అదుపులో పెట్టుకో. కచ్చితంగా ఇలాంటి మాటల్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. పార్టీలకు, సమాజానికి ఇలాంటి వాళ్ల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు.మా పార్టీ ఉద్దేశం కాదు. కచ్చితంగా రెచ్చగొట్టి టైం పాస్ చేయాలనుకునే మూర్ఖుల పని " అని తన "X" ఖాతా లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా హోం మంత్రి అనిత, ఏపీ డీజీపీలకు ఫిర్యాదు చేశారు. దేనితో చేబ్రోలు కిరణ్ కుమార్ అరెస్టు ఖాయం అంటూ నెటిజెన్స్ స్పందిస్తున్నారు. తిరుగుబాటు రావడంతో కంగుతున్న కిరణ్ కుమార్ వైఎస్ భారతికి క్షమాపణ చెబుతూ మరొక వీడియో రిలీజ్ చేశారు. ఆవేశంలో మాట్లాడిన మాటలను క్షమించాలంటూ ఆయన ఆ వీడియోలో పేర్కొన్నారు.

## తెలంగాణలో 604 కొత్త బ్రాండ్లు



45 పాత కంపెనీల నుంచి 218 బ్రాండ్లు ఉన్నాయి. ఈ బ్రాండ్ల అమ్మకాల కోసం 92 మద్యం సరఫరా కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఫిబ్రవరి 23న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఈ దరఖాస్తులను ఆహ్వానించింది, దీనివల్ల మద్యం మార్కెట్‌లో వైవిధ్యం, పోటీ పెరిగే అవకాశం ఉంది. ఈ కొత్త బ్రాండ్లు వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అందించడంతో పాటు, రాష్ట్ర ఆదాయాన్ని కూడా పెంచవచ్చని అధికారులు భావిస్తున్నారు.తెలంగాణలో మద్యం వినియోగం గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది. 202324 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాల ద్వారా సుమారు రూ.30,000 కోట్ల ఆదాయం సమకూరినట్లు అబ్కారీ శాఖ అంచనా. కొత్త బ్రాండ్ల ఆగమనంతో ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే, కొత్త బ్రాండ్ల పరిచయం వల్ల స్థానిక బ్రాండ్లపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. విదేశీ బ్రాండ్ల రాకతో ప్రీమియం మద్యం వినియోగం కూడా పెరిగే అవకాశం ఉంది, ఇది రాష్ట్రంలోని హైఎండ్ బార్లు, రెస్టారెంట్లకు లాభదాయకంగా మారవచ్చు.బ్రాండ్ల దరఖాస్తులతో పాటు, వైన్ షాపులు మరియు బార్ల మధ్య వివాదం కూడా తెరపైకి వచ్చింది. తెలంగాణ వైన్స్ డీలర్స్ అసోసియేషన్, బార్స్ అసోసియేషన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలో మద్యం ఆదాయంలో 85% వైన్ షాపుల ద్వారా, కేవలం 15% బార్ల ద్వారా సమకూరుతుందని వైన్స్ డీలర్స్ ఆరోపించారు. అయినప్పటికీ, బార్లకు రాత్రి 12 గంటల వరకు వ్యాపార అనుమతి ఉండగా, వైన్ షాపులు రాత్రి 10 గంటలకే మూసివేయాలని నిబంధన ఉందని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిబంధనలు వైన్ షాపులపై ఆంక్షలుగా పనిచేస్తున్నాయని, బార్లకు మాత్రం అనవసరమైన వెసులుబాటు కల్పిస్తున్నాయని వారు ఆరోపించారు.బార్స్ అసోసియేషన్, మరోవైపు, వైన్ షాపులు తమ వ్యాపారంపై ప్రభావం చూపుతున్నాయని, రాత్రి వేళల్లో మద్యం అమ్మకాలను నియంత్రించాలని వాదిస్తోంది. ఈ వివాదం రాష్ట్రంలో అబ్కారీ నిబంధనలపై కొత్త చర్చకు దారితీసింది, ప్రభుత్వం ఈ రెండు వర్గాల మధ్య సమతుల్యతను ఎలా సాధిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.కొత్త బ్రాండ్ల దరఖాస్తులతో అబ్కారీ శాఖ ముందు కొన్ని సవాళ్లు ఉన్నాయి. మొదట, ఈ బ్రాండ్ల నాణ్యత, ధరల నియంత్రణను పర్యవేక్షించడం. రెండవది, నకిలీ మద్యం, అక్రమ అమ్మకాలను నియంత్రించడం. గతంలో తెలంగాణలో నకిలీ మద్యం సరఫరా కేసులు నమోదైన నేపథ్యంలో, కొత్త బ్రాండ్ల పరిచయంతో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. అందుకే, అబ్కారీ శాఖ కఠినమైన తనిఖీలు, నిబంధనల అమలుపై దృష్టి సారించాల్సి ఉంది. అదే సమయంలో, వైన్ షాపులు, బార్ల మధ్య వివాదాన్ని పరిష్కరించి, నిబంధనలను సమానంగా అమలు చేయడం కూడా అధికారులకు సవాలుగా మారిందితెలంగాణ ఆర్థిక వ్యవస్థలో మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం కీలక పాత్ర పోషిస్తోంది. అబ్కారీ శాఖ ద్వారా సేకరించిన రాబడి రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతోంది. అయితే, మద్యం వినియోగం పెరగడం వల్ల సామాజిక సమస్యలు——మద్యపాన అలవాటు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు——కూడా పెరుగుతున్నాయని విమర్శలు ఉన్నాయి. కొత్త బ్రాండ్ల పరిచయంతో ఈ సమస్యలు మరింత తీవ్రమవుతాయా అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచడంతో పాటు, మద్యం వినియోగం వల్ల కలిగే సామాజిక సమస్యలను తగ్గించేందుకు సమగ్ర విధానం రూపొందించాల్సి ఉంది.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

## 25 లక్షల విలువగల 28.6 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

- వేసవి దృష్ట్యా జరిగే దొంగతనాలపై జిల్లా పోలీసుల ప్రత్యేక దృష్టి
- పోలీసు శాఖ వారి సూచనలు పాటించి దొంగతనాలు నియంత్రణ కు జిల్లా ప్రజలు సహకరించాలి
- అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- జిల్లా ఎస్పి శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్



**జయభేరి, జగిత్యాల జిల్లా :**

నేరస్థుడు బక్క శెట్టి కొమరయ్య @ రేగుల అజయ్ కుమార్ (53), తండ్రి కొమరయ్య, కులము ముదిరాజ్, నివాసము తిలక్ నగర్, మంచిర్యాల టౌన్, స్వస్థలము రాజారం గ్రామం మల్యాల మండలం జగిత్యాల జిల్లా, వృత్తి దొంగతనాలు చేయడం.

**నేరస్థుని యొక్క పూర్తి నేర చరిత్ర..**

ఇతను మొదటగా హైదరాబాద్ లోని కోటి లో గల కింగ్ లారీ ట్రాన్స్పోర్ట్ లో పనిచేసి అతని యజమాని జీతం ఇవ్వడం లేదని మొట్టమొదటగా లారీలోని పాటలు పాడె డెక్కును దొంగతనం చేసి పోలీసు వారికి దొరికి జైలుకు వెళ్లి వచ్చినాడు. మరల హైదరాబాద్ లో పలు దొంగతనాలు చేసి పోలీసువారికి దొరికి చంచల్ గుడా జైలుకు వెళ్లి వచ్చినాడు బయటకు వచ్చిన తర్వాత దొంగతనాన్ని తన వృత్తిగా ఎంచుకొని వివిధ ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినాడు. 20182021 వరకు వరంగల్ సెంటర్ జైల్లో ఉండి వచ్చినాడు ఇట్టి నేరస్థుడు ఇప్పటి వరకు 25 దొంగతనాల కు చేయడం జరిగింది. జగిత్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేసి ఈ నెల 09న జగిత్యాల పట్టణ పోలీస్ వారు కొత్త బస్టాండ్ లో చౌరస్తా ఏరియాలో వాహన తనిఖీ చేస్తుండగా సమయం 06:00 గంటలకు అనుమానస్పద స్థితిలో తిరుగుతున్న నెరస్తున్ని పట్టుకుని విచారించగా అతని వద్ద బంగారు నగలు పట్టుబడగా పంచుల సమక్షంలో పూర్తి విచారణ చేసి అనంతరం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనైనది.




**నేరస్థుని M.O..**

నేరస్థుడు ప్రత్యేకించి దొంగతనాలు చేయడానికి అతని వద్ద ఎలాంటి వస్తువులను తీసుకునిపోడు అతిగా మద్యం తాగి దొంగతనానికి వెళ్ళిన ప్రాంతంలో దొరికిన వస్తువులతోనే తలుపుల యొక్క తాళాలు గొల్లంలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతుంటాడు. జిల్లా లో నేరస్థుడు తేదీ: 28032025 రోజున అరవిందనగర్, జగిత్యాల వద్ద తేదీ:1603 2024 రోజున హనుమాన్ వాడ జగిత్యాల వద్ద తేదీ:18012025 రోజున పురాణిపేట జగిత్యాల వద్ద తేదీ:16022025 రోజున గణేష్ నగర్ జగిత్యాల వద్ద తేదీ:23022025 రోజున పద్మనగర్, జగిత్యాల వద్ద తేదీ:07032025 రోజున గోవిందుపల్లి, జగిత్యాల వద్ద తేదీ:18032025 రోజున కృష్ణనగర్, జగిత్యాలలో ఇలా పలు దొంగతనలకు పాల్పడి బంగారు ఆభరణాలు మరియు నగదు ఎత్తుకెళ్లినాడు. పైన తెలిపిన అన్ని కేసులలో రికవరీ అయిన మొత్తం బంగారం 286.570 గ్రాములు(28.6 తులాలు) విలువ అందాద రూ. 25,00,000/.

ఈ దొంగను పట్టుకొని అతని వద్ద నుండి దొంగ సొత్తును రికవరీ చేయడానికి ప్రతిభ కనబరిచిన జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, SI లు కిరణ్, గీత, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ విశాల్, జీవన్, మల్లేష్, గంగాధర్, సంతోష్, రాజిరెడ్డి జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ రివార్డు అందజేసి అభినందించారు.

**వేసవిలో జరిగే దొంగతనాలు దృష్ట్యా పోలీస్ శాఖ వారి పలు సూచనలు**

ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. వేసవి దృష్ట్యా ఇంటి బయట నిద్రించే సమయంలో విలువైన బంగారు ఆభరణాలు లేకుండా చూసుకోవాలి అదేవిధంగా ఆదమరచి నిద్రపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలి.

---



# సన్న బియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రక నిర్ణయం

- తూంకుంట మున్సిపల్ లో లబ్ధి దారుడి ఇంట్లో భోజనం చేసిన మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, తూంకుంట :**

రేషన్ కార్డు లబ్ధి దారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన చారిత్రక నిర్ణయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా గురువారం మేడ్చల్ నియోజకవర్గం తూంకుంట మున్సిపల్ లోని బాబాగూడాలో లబ్ధి దారుడి ఇంట్లో ఏర్పాటు చేసిన భోజనం కార్యక్రమంలో, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ మండల్ ఎంఆర్ఓ యాదగిరి రెడ్డి, తూంకుంత మున్సిపాలిటీ కమిషనర్ వెంకట వేణుగోపాల్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ (RTA) మెంబర్, భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, శామీర్పేట్ మండల్ అధ్యక్షులు వైస్ గౌడ్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# పేదల సంక్షేమం భాజపా తోనే సాధ్యం

- అంబేద్కర్ చిత్రపటన్ని అందజేస్తున్న భాజపా నేతలు



**జయభేరి, ములుగు, ఏప్రిల్ 10 :**

భారతమాత ముద్దుబిడ్డ భారత ప్రధాని నరేంద్ర మోడీ యొక్క చిత్రపటన్ని బైలాంపూర్ గ్రామపంచాయతీ సెక్రెటరీ రాజు కు అందజేశారు. అలాగే రేషన్ షాపులో మోడీ చిత్రపటం అందజేసి గరిబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా రేషన్ షాపుల్లో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సన్న బియ్యం పథకం గురించి లబ్థిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా నాయకులు పల్లె రమేష్ యాదవ్ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు స్వామి గౌడ్ మండల సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి సర్ది కృష్ణారెడ్డి బూత్ అధ్యక్షులు కనకయ్య యాదవ్ మల్లేష్ గౌడ్ వెంకట్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి నందా రెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# స్కూల్ లో వాటర్ క్యాన్స్ అంతజేత



**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 10 :**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని బీజేపీ నాయకుడు మద్దురి నరసింహ తెలిపారు . వారి జన్మదినం సందర్భంగా జడ్పిహెచ్ఎస్ స్కూల్ లో స్టీల్ వాటర్ క్యాన్స్ ను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఏదో రకంగా గుర్తు ఉండాలని స్టీల్ వాటర్ క్యాన్స్ ను అందజేసారు. పిల్లల కి అలగే విద్యార్థులు మంచిగా చదువుకొని స్కూల్ కు మంచి పేరు తేవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

# మెమోటో అందజేసిన మండల అధ్యక్షుడు



**జయభేరి, కుకునూర్ పల్లి, ఏప్రిల్ 10 :**

కుకునూరుపల్లి మండలంలో గల చిన్న కిస్టాపూర్ గ్రామంలో , జై భీమ్ యూత్ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవనీయులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా డాక్టర్ బాబు జగజీవన్ రావ్ విగ్రహావిష్కరణ చేయడం జరిగింది.అనంతరం భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, కుకునూరు పల్లి మండల బిజెపి మండల అధ్యక్షులు అనుమల సంపత్ రెడ్డి, కుకునూరుపల్లి మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నాగరాజు చేతుల మీదుగా చిరు సన్మానం చేసి మెమొంటో బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ గౌరారం కృష్ణ,జనరల్ సెక్రెటరీ సదానంద గౌడ్, రెడ్డమైననాగరాజు, ఉపాధ్యక్షుడు బోనాల రాజు, బూత్ అధ్యక్షులు పరశురాం, తన్నీరు యాదగిరి, కోశాధికారి రమేష్ ,గణేష్, రెడ్డమైన శ్రీనివాసు,చిన్నగారి రాజయ్య, చందు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

---





# చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ ఎలుగూరి వల్లపురెడ్డి

**జయభేరి, పీ ఏ పల్లి :**

BRS పార్టీ రజోత్సవ ఉత్సవాలలో భాగంగా చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అంగడిపేట ఎక్స్ రోడ్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎలుగూరి వల్లపురెడ్డి మాట్లాడుతూ చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి అబద్ధపు అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టే విధంగా లక్షలాదిమందిగా తరలి వచ్చి వరంగల్ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మునగాల అంజి రెడ్డి, అర్వపల్లి నరసింహ, ఎర్ర యాదగిరి. రాయనబోయిన శ్రీను, గోలి గిరి,బొడ్డుపల్లి మహేందర్. సుధాకర్ గౌడ్, దామోదర్, రమణంపల్లి, మల్లికంటి వెంకన్న, హనుమ నాయక్, మారుపాక ప్రదీప్ బాలు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# పందుల పెంపకదారులతో సమావేశం

**జయభేరి, దేవరకొండ :**

మునిసిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు మునిసిపల్ ఆఫీస్ నందు సానిటరీ ఇన్స్పెక్టర్ సురిగి శంకర్ పందుల పెంపకదారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పందుల పెంపకం దారులు పందులను పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా పట్టణము నకు దూరంగా పందులను పెంచుకోవాలని ఆదేశించారు. లేని యెడల ఎటువంటి సమాచారం లేకుండా పందుల నివారణకు చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఇట్టి సమావేశం లో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సక్కు నాయక్ పాల్గొన్నారు.

---

# నిధులకు కొరత లేదు.. అభివృద్ధికి హద్దు లేదు..

- అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్ డివిజన్
- చిల్కానగర్ డివిజన్ లో సుమారు 80 లక్షల నిధులతో సిసి రోడ్ల శంకుస్థాపన : ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ బన్నాల

**జయభేరి, ఉప్పల్ :**



చిలుకానగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ, న్యూ రాంనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీలో సుమారు 80 లక్షల నిధుల వ్యాయంతో ముఖ్య అతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఫార్మర్ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి సిసి రోడ్ల శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్ 70 శాతం స్లమ్ ఏరియా ఉండడం కారణంగా ఎక్కువ నిధులు వెచ్చించి చిల్కానగర్ డివిజన్ కు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని డివిజన్ లో సుమారు 80% పనులు పూర్తి చేశామని మిగతా 20 శాతం పనులను కూడా తొందరలో పూర్తి చేస్తామని ఎక్కడ కాళీ ప్రభుత్వ స్థలాలు పార్కులలో ఓపెన్ జిమ్ లను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రణాళిక బద్ధంగా వచ్చిన నిధులను స్ట్రామ్ వాటర్ డ్రైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ అనంతరం సిసి రోడ్లతో ఒక ప్రణాళిక బద్ధంగా పనులను పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని వారిని అభినందించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్ లో నాలుగు సంవత్సరాలల్లో సుమారు 85 కోట్ల రూపాయల నిధులు వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించడం జరిగిందని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు చిల్కానగర్ డివిజన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిధులు వెచ్చించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అను నిత్యం అధికారులను సంప్రదిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయింప చేసే విషయంలో సహకరిస్తున్నందుకు వారికి డివిజన్ ప్రజల తరపున మా తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని కొనియాడారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు డి ఇ వినీల్ గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు కాలనీల, బస్తీల అధ్యక్ష కార్యదర్శులు వారి కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

# నలుగురు ముద్దాయిలు అరెస్ట్

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ లోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన ఏర్పుల సాయి కిషోర్ (34), తండ్రి అంజయ్య, బొడుప్పల్ లో just fit జిమ్ కలదు అలాగే తన స్నేహితుడు అయిన మల్లెల చంటి (34), తండ్రి. నాగేశ్వర రావు, బొడుప్పల్ 2010సం.ల నుండి స్నేహితులుగా ఉన్నారు. వారిద్దరూ కలసి జిమ్ చేసేవారు, కలసి తిరిగే వారు, అలాగే వాళ్ళిద్దరూ ఒకరి ఇంటికి ఒకరు వెళ్ళేవారు, అలా కొద్ది రోజుల తర్వాత మల్లెల చంటి తన స్నేహితుడు అయిన సాయి కిషోర్ తన భార్యాను అనుమానించేవాడు. అలాగే వారిద్దరినీ కూడా మందలించాడు. ఈ విషయంలో తన భార్యా వాళ్ల తల్లి ఇంటికి వెళ్ళింది. ఈ విషయం చంటి తన మనసులో పట్టుకొని సాయి కిశోర్ ను చంపాలనే ఉద్దేశంతో ఈ నెల 07న చంటి చంగిచెర్ల మండి దగ్గరికి వెళ్ళి చాకు కొనుగోలు చేసి, తన స్నేహితులు అయిన బొడుప్పల్ కి చెందిన ధృవ కుమార్ సింగ్, శ్రీకాంత్, మల్కాజ్ గిరికి చెందిన సాయి కిరణ్ లకు జరిగిన విషయం తెల్పగా వారు నలుగురు వ్యక్తులు అదే రోజున సాయంత్రం 07:30 గంటలకు బొడుప్పల్ లో ఉన్న సాయి కిషోర్ యొక్క just fit జిమ్ కి వెళ్ళి అక్కడ ఉన్న సాయి కిశోర్ ను కొట్టి అక్కడే ఉన్న 5 కేజి డంబెల్ తో చంటి, సాయి కిషోర్ తలపై కొట్టగా సాయి కిశోర్ అక్కడే క్రింద పడి తలకు రక్త గాయాలు అయ్యాయి.

వెంటనే కిశోర్ ను బొడుప్పల్ లో ఉన్న అభయ హాస్పిటల్ కి తీసుకెళ్ళి ప్రధమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కొరకు గాంధీ హాస్పిటల్ కి తరలించగా మంగళవారం ఉదయం 06:17 గంటలకు కిశోర్ చికిత్స పొందుతూ తలకి బలమైన గాయం వలన చనిపోయినాడు. గురువారం నాడు నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనైనది.









## జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ఎస్సై రామ్మూర్తి

**కొండమల్లేపల్లి :**

సోలిడార్ తెలంగాణ భధిర పాఠశాల విద్యార్థులకు కొండమల్లేపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి అభినందనలు తెలియజేశారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం లో జరిగిన జాతీయ స్థాయి క్రీడలలో సోలిడార్ తెలంగాణ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా సోలిడార్ తెలంగాణ పాఠశాల నిర్వహకులు కొండమల్లేపల్లి లో 80 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కొండమల్లేపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభానికే పరిమితం కాకుండా విద్యార్థులతో కలిసి ర్యాలీలో పూర్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర బలం కన్నా బుద్ధిబలం గొప్పదని ఇట్టి విషయాన్ని గ్రహించి విద్యార్థులు క్రీడలలో రాణించడం అభినందనీయమన్నారు. ఇక ముందు ఇంకా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మీ తల్లిదండ్రులకు తెలంగాణ రాష్ట్రానికి భారతదేశానికి పేరు తెచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులను ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, క్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ దుండిగళ్ల అశోక్, సోలిడార్ తెలంగాణ పాఠశాల డైరెక్టర్ దార్ల భాస్కర్, నిర్వాహకులు సురేష్ కుమార్, ఏరుకొండ చంద్రయ్య, వినోద్, సైదా నాయక్, వెంకటమ్మ, సంపత్ ,కవిత తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణ జూవెలర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**పరకాల, ఏప్రిల్ 10:**

పరకాల పట్టణంలోని అంగడి బజార్లో పూర్ణ జ్యువెలర్స్ యజమాని బెజ్జంకి పూర్ణ చారి, తొమ్మిదో వార్డ్ మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పరకాల శ్రీ కుంకుమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పరకాల వాస్తవ్యులు తొమ్మిదో వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి( పూర్ణ జువెలర్స్ ) ఆధ్వర్యంలో అంగడి బజార్ కూరగాయల మార్కెట్ గల్లీలో సొంత ఖర్చులతో మండుటెండలో ఎండాకాలం పరకాల వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చే సదుద్దేశంతో చల్లటి నీటిని ప్రజలకు అందించాలని, ప్రజలకు తన వంతు సేవ చెయ్యాలనే సేవా దృక్పథంతో చలివేంద్రమును ప్రారంభించడం ఆనందదాయకమని మును ముందు మరెన్నో ప్రజా సేవా కార్యక్రమాలలో పాల్గొని ప్రజలకు తన వంతు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగ బండి జ్ఞానానందం, వెనిశెట్టి శ్యామ్, పూలమాటి సదానందం, నూక సురేష్ , కేశవ రెడ్డి, కానుగుల గోపి, రాజు శివ రమేష్ , అభిలాష్ , వెంకటేశ్వర్లు , రామకృష్ణ , బాలకృష్ణ సూర్య ప్రకాష్ బిక్షపతి , సిద్దు , తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట భోజనం చేసిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, ఏప్రిల్ 10:**


పేద, ధనిక అనే తేడా లేకుండా ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకొచ్చిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల మండలం పోచారం గ్రామంలో కోడెపాక సంపత్ రాణి ల లబ్ధిదారుని ఇంట్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలామంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించేవారని, తినేందుకు సన్నబియ్యం మార్కెట్ లో కొనుక్కుని తిరేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు సన్నబియ్యం తీసుకుని సంతోషంగా ఉన్నారని ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారన్నారు. సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి పేద కుటుంబం నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పేద బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భారాన్ని తగ్గించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతి పేద కుటుంబం ఆకలికి గురికాకుండా, పోషక ఆహారాన్ని సమృద్ధిగా అందుకునేలా పథకం రూపొందించబడిందన్నారు. సన్న బియ్యం పంపిణీ వ్యవస్థలో ఇలాంటి అక్రమలను సహించేది లేదన్నారు.



ఆ కుర్రాడిది మధ్య తరగతి కుటుంబం.. చాలీచాలని సంపాదన.. రెక్కాడితేకానీ డొక్కాడదు.. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా లక్ష్యం కోసం కలలు కంటారా..? 'మనవల్ల కాదులే' అని పేదరికానికే తలవంచుతారు. దీనంగా ఉండిపోతారు. కానీ నల్లగొండ జిల్లాకు చెందిన లట్టుపల్లి స్వామి మాత్రం కల కనడమే కాదు.. దాని నిజం చేసుకోవడం కూడా తెలుసు. ఒకప్పుడు గల్లీల్లో 'మయాదారి మైసమ్మో మైసమ్మా'.. అంటూ పెళ్లి బారాత్ లో పాటలు వినిపించే కుర్రాడు.. 'నేను రాను బోంబాయికు రాను.. అనే ట్రెండీపాటలను మిక్స్ చేస్తూ డీజేగా అదరగొడుతున్నాడు. 'డీజే టిల్లూ వీడు.. బేసు జర పెంచి కొట్టు.. బాక్సులు పగిలిటట్టు' అనే స్టైల్లో దూసుకుపోతున్నాడు ఈ యంగ్ తరంగ్.

.....బాలు జాజాల

# డీజే స్వామి (వీడి సౌండే వేరు)



**జయభేరి, హైదరాబాద్ :**

**అది 2018.. నల్లగొండలోని క్లాక్ టవర్.. ప్రధాన రహదారి.. వినాయకుడి ఊరేగింపులో యువకులంతా జోరుగా స్టెప్పులు వేస్తున్నారు. జిల్ జిల్ జిగేల్ రాణి లాంటి పాటలకు మైమరిపోయారు. నచ్చిన పాటలు ప్లే చేస్తూ మరింత జోరు పెంచడంతో చాలామంది గూమిగుడారు. అప్పడే పోలీసులు ఎంట్రీ ఇచ్చి అక్కడున్నవారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. పబ్లిక్ గ్యాదరింగ్ కు కారణమైన పాటలు ప్లే చేసే కుర్రాడిని అదుపులోకి తీసుకున్నారు. "నువ్వేంటి.. నీ జుట్టేంటీ.. నీ కథేంటి' అంటూ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. తన లక్ష్యం కోసం చినప్పడే కటకటాలపాలైన ఆ కుర్రాడే ఈ లట్టుపల్లి స్వామి. ఆ తర్వాత ఎవరూ ఊహించనివిధంగా ఫ్రొఫెషనల్ డీజేగా మారి నల్లగొండ నుంచి నాంపల్లి వరకు.. మాదాపూర్ నుంచి రాజమండ్రి తన డీజే పాటలతో, స్టెప్పులతో హోరెత్తిస్తున్నాడు.**

**అలా మొదలైంది..**

లట్టుపల్లి స్వామిది నల్లగొండ జిల్లా అయిటిపాముల గ్రామం. తల్లిదండ్రులు నర్సింహ, సైదమ్మ, చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో అక్క స్వప్నతో కలిసి కూలీ పనులు లాంటివి చేసి కుటుంబానికి అండగా నిలిచేవాడు. ఈ క్రమంలో తన ఇంటికి ఎదురుగా ఉన్న డీజే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఒకవైపు చదువుకుంటూనే, మరోవైపు అతనితో కలిసి వేడుకలకు వెళ్లడం, పాటలు మిక్స్ చేయడం లాంటివి చేసేవాడు. ఇందుకుగాను రోజుకూ రూ.150 నుంచి 200 వందల వరకు సంపాదించేవాడు. ఆ డబ్బులతో కుటుంబానికి తనవంతు సాయం చేసేవాడు. నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట ఏరియా ఏదైనా స్వామి ఆకట్టుకునే పాటలు ప్లే చేసేవాడు. సాధారణంగా ఫంక్షన్లు అంటేనే హోరెత్తించే పాటలు వినిపించాలి. ఏమాత్రం తేడా వచ్చినా బాక్సులు సైతం బద్ధలవుతుండేది.




కానీ స్వామి మాత్రం ప్రేక్షకుల అభిరుచకనుగుణంగా పాటలు మిక్స్ చేసి ఆకట్టుకునేవాడు. అయితే ఎంత కష్టపడినా రోజుకు 200 మాత్రమే వచ్చేవి. తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ప్రొఫెషనల్ డీజే వైపు అడుగులు వేశాడు.

**బాబాయ్ ప్రోత్సాహంతో..**

సాధారణంగా హైదరాబాద్ లాంటి మహనగర్ లో ఏదైనా ఈవెంట్ కు వెళ్లాలంటే కనీసం రూ.5 వేలు, లేదా పదివేలు అయినా చేతిలో ఉండాలి. అలాంటిది డీజే కోర్సు చేయాలంటే అనుకున్నదాని కంటే ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సిందే. స్వామి పట్టుదల చూసి బాబాయ్ లట్టుపల్లి విక్రం రూ.15 వేలు ఇవ్వడంతో ఆ డబ్బుకు మరింత కొంత కలుపుకొని ముంబైకి వెళ్లాడు స్వామి. అక్కడ అనేక డీజే అకాడమీలు తిరిగి



పాటలు ఎలా ప్లే చేస్తారు? ఎలా మిక్సింగ్ చేస్తారు? అనే విషయాలు దగ్గరుండి గమనించాడు. ఇలా రెండు నెలలు ముంబైలోనే ఉండి తక్కువ కాలంలోనే పట్టు సాధించాడు. అయితే అదే సమయంలో హైదరాబాద్ లో 2017లో 40 మ్యాప్ డీజే అకాడమీ కొత్తగా ప్రారంభంకావడంతో అందులో జాయిన్ అయ్యాడు. కేవలం 30రోజుల్లో స్టరిఫైడ్ డీజే ట్యాగ్ ను సొంతం చేసుకున్నాడు. అందుకు కారణం చిన్నప్పట్నుంచే డీజేపై ఆసక్తి ఉండటమే. ఆ తర్వాత హైదరాబాద్ లోని పలు ఏరియాల్లో డీజే హీనోస్ గా రాణిస్తూ అందరిని మెప్పిస్తున్నాడు.

**లక్షకుపైగా బిజినెస్..**

ఒకప్పుడు రోజుకు రూ.200 సంపాదించే స్వామి నేడు లక్షకుపైగా బిజినెస్ చేయగల సామర్థ్యం సొంతం చేసుకున్నాడు. ఏదైనా ఈవెంట్ జరుగుతుందంటే డీజే స్వామి కోసం.. వందల సంఖ్యలో యువకులు పోగవుతున్నారు. ఈ క్రమంలో కనీసం లక్ష వరకైనా బిజినెస్ జరుగుతుందంటే స్వామి ప్రత్యేకత ఎంటో అర్థం చేసుకోవచ్చు. "నేను ఈ స్థాయికి రావడం కారణం బాబాయ్ విక్రం, అక్క స్వప్న. వీరిద్దరి బాగా ఎంకరేజ్ చేసి ప్రోత్సహించారు. ఇటీవల వైజాగ్ లో జరిగిన 'వార్ ఆఫ్ డీజే' పోటీల్లో థర్డ్ ప్రైజ్ గెలుచుకున్నా.. ఇదంతా వాళ్లిచ్చిన ప్రోత్సహమే. ఒక్క మాటలో చెప్పాలంటే పేదరికమే నన్ను ఈస్థాయికి చేర్చింది. ప్రస్తుం దేశంలోని పేరొందిన ఓ క్లబ్ లో డీజేగా పనిచేస్తున్నా' అని చెప్పాడు స్వామి.

# లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి

**పరకాల, ఏప్రిల్ 10:**

పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గురువారం అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు కళ్యాణ్ లక్ష్మీ పథకం ద్వారా 1719 మందికి 17 కోట్ల 20 లక్షల 99వేల 404రూపాయలు,సీఎంఆర్ఎఫ్ ద్వారా 1463 మందికి 4కోట్ల 64లక్షల16వేల 500రూ విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటివరకు 3268 మందికి 23 కోట్ల 57 లక్షల 29 వేల 404 రూపాయల ను పంపిణీ చేసామన్నారు. పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిలుస్తుంది అని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి వరంగా మారిందన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆడ



పిల్లల పెళ్లి భారం తగ్గిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వా నిర్లక్ష్యం వైఖరి వల్ల కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం అయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సకాలంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందేలా కృషి చేస్తామని తెలిపారు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రైతు రుణమాఫీ, పేద ప్రజలకు ఇంద్రమ్మ ఆత్మీయ భరోసా, సన్న వడ్లకు రూ 500 బోనస్, ఇందిరమ్మ ఇల్లు, ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అంచలంచలుగా అమలు చేస్తున్నామని తెలిపారు.

## గచ్చిబౌలి భూముల్లో కేంద్రకమిటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 10:**

తెలంగాణలో పొలిటికల్ హీట్ పెంచిన కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూవివాదంలో కీలక అప్‌డేట్ ఇది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం జోక్యం చేసుకుంది. అసలేం జరుగుతుందో తెలుసుకునేందుకు కేంద్ర పర్యావరమ, అటవీ శాఖల సాధికార కమిటీ వచ్చింది. క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. వివరాలు నమోదు చేసుకున్న తర్వాత నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్‌తోపాటు మరో ఇద్దరు ఈ కమిటీలో ఉన్నారు. ఈ ఉదయం హైదరాబాద్ చేరుకున్న ఈ కమిటీ విచారణ చేస్తోంది. . ఇవాళ రేపు కంచ గచ్చి బౌలి భూముల్లో తిరిగి పరిశీలించనున్నారు. అక్కడి వారితో కూడా మాట్లాడబోతున్నారు. ప్రభుత్వ అధికారులతో కూడా సమావేశంకానున్నట్టు తెలుస్తోంది. కంచగచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న సంగతి తెలిసిందే. అక్కడ జరుగుతున్న పనులు ఆపాలని ఆదేశించిన కోర్టు ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ తన పని స్టార్ట్ చేసింది.3 ఏప్రిల్ 2025న సుప్రీంకోర్టు ఈ భూముల వివాదంలో కీలక వ్యాఖ్యలు చేసింది. వివాదాస్పద భూముల్లో చెట్లు నరికివేత, చదును చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. హైకోర్టు ఇచ్చిన నివేదిక ప్రకారం కంచ గచ్చబౌలి భూముల్లో చెట్లు నరికివేసినట్టు తేలిందని ఇది చాలా సీరియస్ విషయమని అభిప్రాయపడింది.




## హన్మకొండకు చెందిన కందగట్ల స్వప్నకు పీహెచ్.డి. డిగ్రీ

### ఔషధ పరిశోధనకు జాతీయ గుర్తింపు

**హన్మకొండ, ఏప్రిల్ 10:**

హన్మకొండ గోపాలపురంకు చెందిన కందగట్ల స్వప్నకు చైతన్య (డీమ్డ్ టు బీ) విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్.డి. డిగ్రీ లభించింది. "తెలంగాణ గిరిజన ప్రాంతాల ఎథ్నో మెడిసిన్లను ప్రమాణీకరించి, వాటినుండి ఉపయోగకరమైన ఔషధాలను వెలికితీయడం" అనే శీర్షికపై చేసిన పరిశోధనకు ఈ ప్రతిష్టాత్మక డిగ్రీను వరించారు. కందగట్ల స్వప్న 2021లో హన్మకొండ కిషన్‌పురాలోని చైతన్య విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగంలో పీహెచ్.డి.కు చేరారు. పరిశోధన కార్యక్రమాన్ని చైతన్య విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగానికి చెందిన డా.సృజన పర్యవేక్షణలో, కాకతీయ యూనివర్శిటీ జంతు శాస్త్ర విభాగ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి సహ పర్యవేక్షణలో కొనసాగించారు. పీహెచ్.డి.లో చేరేముందే ఆమె ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలోని జంతు శాస్త్ర విభాగంలో ఒక పరిశోధన ప్రాజెక్టులో సీనియర్ రిసెర్చ్ ఫెలో (SRF)గా విధులు నిర్వహించారు. తన పరిశోధనలో తెలంగాణ గిరిజన ప్రాంతాలలో వాడుతున్న సంప్రదాయ ఔషధ పద్ధతుల శాస్త్రీయ ధృవీకరణతోపాటు, వాటి నుండి హెచ్ఐవీ వంటి వైరస్‌లపై ప్రభావవంతమైన ఔషధ అణువులను గుర్తించారు. 2024లో పరిశోధన పూర్తిచేసిన స్వప్న, అదే ఏడాది తన పరిశోధన అంశంపై భారత పేటెంట్ కార్యాలయానికి పేటెంట్ దరఖాస్తు చేశారు. ఇటీవలే ఆమెకు పేటెంట్ మంజూరు కావడం గర్వకారణం. హైదరాబాద్‌లోని చైతన్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వైవావోస్ కార్యక్రమంలో ఢిల్లీ ఫార్మసీ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ ప్రవీణ్, చైతన్య యూనివర్సిటీ R&D డీన్ ప్రొఫెసర్ క్రిస్టఫర్, ఫార్మసీ విభాగ అధ్యాపకులు ప్రొ. సారిక, జగదీష్ తదితరుల సమక్షంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. రవీందర్ చేతుల మీదుగా పీహెచ్.డి. డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, స్వప్న కుటుంబ సభ్యులు కందగట్ల స్వప్నకు అభినందనలు తెలిపారు. ఔషధ పరిశోధనలో స్వప్న చేసిన కృషి గ్రామీణ వైద్య విధానాలకు శాస్త్రీయ బలమిచ్చే విధంగా ఉండటం గమనార్హం.

ప్రభాత జయభేరి
www.jayabheridaily.com
జనరల్ న్యూస్
11-04-2025
శుక్రవారం





# షాన్‌దార్ ఢిల్లీ.. ఆర్‌సీబీపై ఘన విజయం

- రాహుల్ అజేయ అర్ధ సెంచరీ
- రాణించిన కుల్దీప్, విప్రాజ్

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ దుమ్మురేపుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ఓటమన్నది ఎరుగకుండా దూసుకెళుతున్నది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)ను ఢిల్లీ చిత్తుచిత్తుగా ఓడించింది. కుల్దీప్‌యాదవ్, విప్రాజ్ నిగమ్ స్పిన్ తంత్రంతో ఆర్‌సీబీ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. సాల్ట్, డేవిడ్ మినహా అందరూ విఫలమయ్యారు. లక్ష్యఛేదనలో 30 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన ఢిల్లీని 'లోకల్‌బాయ్' కేఎల్ రాహుల్ ఒంటిచేత్తో గెలిపించాడు. కొట్టిన పిండిల్లాంటి చిన్నస్వామిలో రాహుల్ అజేయ అర్ధసెంచరీతో జట్టుకు భారీ విజయాన్ని కట్టబెట్టాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అజేయ ప్రస్థానం కొనసాగుతున్నది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులకే పరిమితమైంది. ఫిల్ సాల్ట్ (17 బంతుల్లో 37, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (20 బంతుల్లో 37 నాటౌట్, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. కుల్‌దీప్ యాదవ్ (2/17), విప్రాజ్ నిగమ్ (2/18) బెంగళూరును కట్టడిచేశారు. అనంతరం ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే తడబాటుకు లోనై వెంటవెంటనే వికెట్లు కోల్పోయినా కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 93 నాటౌట్, 7ఫోర్లు, 6సిక్స్‌లు) రాణించడంతో లక్ష్యాన్ని 17.5 ఓవర్లలో ఛేదించింది. స్టబ్స్(38) నాటౌట్‌గా నిలిచాడు. భువనేశ్వర్(2/26)కు రెండు వికెట్లు దక్కాయి. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆరంభంలో సాల్ట్, ఆఖర్లో డేవిడ్ మెరుపులు లేకుంటే బెంగళూరు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. ఇన్నింగ్స్‌ను ఆరంభించిన వేగం చూస్తే మరో భారీ స్కోరు తప్పదేమో అనిపించింది. అక్షర్ రెండో ఓవర్లో కోహ్లీ బౌండరీతో పరుగుల వేటకు శ్రీకారం చుడితే అదే ఓవర్లో సాల్ట్.. 6, 4తో బాదుడుకు గేట్లెత్తాడు. స్టార్క్ 3వ ఓవర్ అయితే వార్ వన్ సైడే. ఆ ఓవర్లో సాల్ట్.. 6, 4, 4, 6, 4తో రెచ్చిపోవడంతో స్టార్క్‌ను ఆటాడుకున్నాడు. నోబాల్ బౌండరీతో కలుపుకుని స్టార్క్ ఓవర్లో ఏకంగా 30 పరుగులు వచ్చి చేరడంతో ఆర్‌సీబీ 3 ఓవర్లలోనే 53 పరుగులు చేసింది.

ఐపీఎల్‌లో ఇంత తక్కువ వ్యవధిలో ఫిఫ్టీ రన్స్ మార్కును అందుకోవడం బెంగళూరుకు ఇది రెండోసారి (మొదటిది 2011లో కొచ్చి టస్కర్స్‌పై). అయితే అక్షర్ 4 ఓవర్లో అనవసరపు పరుగుకు యత్నించిన సాల్ట్.. రనౌట్‌గా వెనుదిరిగాడు. అక్కడ్నుంచి ఆర్‌సీబీ గాడి తప్పింది. పడిక్కల్ (1).. ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో అక్షర్‌కు క్యాచ్ ఇవ్వగా విప్రాజ్ 7వ ఓవర్లో కోహ్లీ.. స్టార్క్ చేతికి చిక్కాడు. ఢిల్లీ స్పిన్నర్లు కుల్‌దీప్, విప్రాజ్.. బెంగళూరును కట్టడిచేసి కీలక వికెట్లు పడగొట్టారు. లివింగ్‌స్టన్ (4), జితేశ్ (3)తో పాటు సారథి రజత్ పటీదార్ (25) కూడా నిరాశపరిచాడు. 15వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన డేవిడ్.. తొలి 8 బంతుల్లో చేసినవి 4 పరుగులే. కానీ అక్షర్ 19వ ఓవర్లో 6, 4, 6తో రెచ్చిపోయిన అతడు.. ముకేశ్ వేసిన చివరి ఓవర్లోనూ రెండు సిక్సర్లు, ఓ బౌండరీతో 19 పరుగులు రాబట్టడంతో బెంగళూరు పోరాడగలిగే స్కోరును సాధించింది.

స్వల్ప ఛేదనలో క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే తడబాటుకు లోనైంది. వరుస ఓవర్లలో ఆ జట్టు కీలక వికెట్లను కోల్పోయి ఛేదనను పీకలమీదకు తెచ్చుకుంది. ధయాల్ రెండో ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన డుప్లెసిస్ (2) మిడాఫ్‌లో పటీదార్‌కు క్యాచ్ ఇచ్చాడు. భువనేశ్వర్ వేసిన మరుసటి ఓవర్లో జేక్ ఫ్రేసర్ (7) సైతం అతడినే అనుసరించాడు. 5వ ఓవర్లో భువీ.. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభిషేక్ పోరెల్ (7)నూ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ అక్షర్ (15) సైతం సుయాశ్ శర్మ 9వ ఓవర్లో లాంగాఫ్‌లో డేవిడ్ చేతికి చిక్కడంతో 58 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయింది. బెంగళూరు బౌలర్లు విజృంభణతో సహచర బ్యాటర్లు పెవిలియన్‌కు చేరుతున్నా రాహుల్ మాత్రం క్రీజులో నిలబడ్డాడు. 5 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పటీదార్ క్యాచ్‌ను వదిలేయడంతో బతికిపోయిన రాహుల్.. అక్షర్, స్టబ్స్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. వీలుచిక్కినప్పుడల్లా బంతిని స్టాండ్స్‌లోకి పంపిస్తూ రన్‌రేట్ పడిపోకుండా జాగ్రత్తపడ్డ రాహుల్.. కృనాల్ 12వ ఓవర్లో స్లాగ్ స్వీప్‌తో సిక్సర్ బాది ఇన్నింగ్స్ గేర్ మార్చాడు.

లివింగ్‌స్టన్ 13వ ఓవర్లోనూ 4, 6తో రెచ్చిపోయిన అతడు.. 37 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో స్టబ్స్ కూడా చెలరేగడంతో ఆర్‌సీబీ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. మధ్యలో వర్షం వచ్చినా..రాహుల్, స్టబ్స్ బౌండరీలు బాదడంతో మరో 13 బంతులుండగానే ఢిల్లీ గెలుపు ఖరారైంది. వీరిద్దరు కలిసి ఐదో వికెట్‌కు 111 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పడం మ్యాచ్ గతిని మార్చేసింది.

బెంగళూరు: 20 ఓవర్లలో 163/7 (సాల్ట్ 37, డేవిడ్ 37, కుల్‌దీప్ 2/17, విప్రాజ్ 2/18)

ఢిల్లీ:17.5 ఓవర్లలో 169/4 (రాహుల్ 93 నాటౌట్, స్టబ్స్ 38 నాటౌట్, భువనేశ్వర్ 2/26, సుయాశ్ 1/25)

# అమ్మాయిలకు 20ల్లోనే వృద్ధాప్యం ముంచుకోస్తుంది..

- ప్రతిఒక్కరూ ఎప్పటికీ యవ్వనంగా కనిపించాలని కోరుకుంటారు. ముఖ్యంగా మహిళలు 20 ఏళ్ల పడుచు వారిలా కనిపించడానికి రకరకాల తంటాలు పడుతుంటారు. అంతుకు ఎన్నో సౌందర్య ఉత్పత్తులను ఉపయోగించి వివిధ వ్యాయామాలు కూడా చేస్తుంటారు. అన్ని వ్యాయామాలు చేసినప్పటికీ, కొంతమంది మహిళలు తమ అసలు వయస్సు కంటే పెద్దవారిగా కనిపిస్తుంటారు. అవును, కొంతమంది మహిళలు 25 ఏళ్ల వయసులోనూ 40 ఏళ్ల వారిలా కనిపిస్తారు. చిన్న వయసులో వృద్ధురాలిలా, ఆంటీ ఎందుకు కనిపిస్తున్నారో తెలియక తెగ ఆందోళన పడుతుంటారు. నిజానికి, ఇలాంటి అమ్మాయిలు వారి రోజువారీ అలవాట్ల కారణంగా ఇలా అకాల వృద్ధాప్యానికి కారణమవుతారని నిపుణులు అంటున్నారు.



శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకే నిపుణులు రోజుకు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సిఫార్సు చేస్తుంటారు. కానీ కొంతమంది అమ్మాయిలు ఈ విషయంలో కాస్త ఉదాసీనత ఉండి వ్యాయామానికి దూరంటా ఉంటారు. అలాంటి అమ్మాయిలు తమ వయసుకంటే కాస్త ముందుగానే వృద్ధులుగా కనిపిస్తారు.

అలాగే అతిగా ఆందోళన చెందడం మంచిది కాదు. అది ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ విషయం తెలిసినా కొంతమంది అమ్మాయిలు చిన్న చిన్న విషయాలకే చింతిస్తూ రోజులు గడుపుతుంటారు. ఎక్కువగా ఆందోళన చెందే అమ్మాయిలు తమ వయస్సు కంటే పెద్దవారిగా కనిపిస్తారు. మితిమీరిన కోపం మంచిది కాదని పెద్దలు అంటుంటారు. కానీ కొంతమంది అమ్మాయిలు చిన్న చిన్న విషయాలకే కోపం తెచ్చుకుంటారు. ఈ కోపం మానసిక సమస్యలు, ఒత్తిడి, నిరాశకు కారణమవుతుంది. ఇది అకాలంగా వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. నీళ్లు ఎక్కువగా తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ కొంతమందికి నీళ్లు తాగడం అంటే అలెర్జీ. వాళ్ళు ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లు తాగకుండా ఉంటారు. నీరు తాగకపోవడమనే ఈ అలవాటు అమ్మాయిల్లో వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత నిద్రపోవడం చాలా ముఖ్యం. రోజుకు కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. కానీ కొంతమంది అమ్మాయిలు ఆలస్యంగా పడుకుని ఉదయాన్నే త్వరగా మేల్కొంటారు. వీరికి తగినంత నిద్ర ఉండదు. ఈ నిద్ర లేకపోవడం ఒత్తిడికి గురిచేసి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తుంది.



# వేసవి కాలం ప్రతి నిటి బొట్టు విలువైనదే..

- వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మరిన్ని చలివేంద్రాలు అవసరం
- ఎల్బీనగర్ లో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఈ ఆనందం రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ, ఈ రాములు టీ పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

✍ జయభేరి, ఎల్బీనగర్, ఏప్రిల్ 10 :

వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ.ఆనందం సార్ అడిషనల్ ఎస్పీ రిటైర్డ్ గారు, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరి ఎర్రవల్ల రాములు సార్ అన్నారు. మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్డు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందం సార్ మాట్లాడుతూ... వేసవికాలంలో బాటసారులు తాగేందుకు గుక్కెడు నీరు లభించక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ డబ్బులు పెట్టుకొని మంచినీళ్ళ బాటిళ్లు కొని తాగే స్తోమత అందరికి ఉండదు కాబట్టి వచ్చిపోయే వాహనదారులు, పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎల్ బీ నగర్ రింగ్ రోడ్ లో ఏర్పాటు చేయడం సంతోషకరమని నిర్వాహకులను వారు అభినందించారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ ఎల్బీనగర్ ప్రధాన కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ప్రజల దాహార్తిని తీర్చాలని ఆలోచన రావడం హర్శించదగ్గ విషయం అని ఈరోజుల్లో ఎవరి స్వార్థంతో వాళ్లు బతుకు తుంటే ఈ ఎండాకాలంలో పది మందికి మంచినీరు పోయాలని ఆలోచన రావడం అలాగే పది మందికి సేవ చేయాలని సహృదయంతో ఫౌండేషన్ సభ్యులు ముందుకు రావడం చాలా సంతోశించదగ్గ విషయం, వేసవి తాపం తాలలేక పక్షులు, మనుషులు ఎండకు విల విలలాడుతున్నాయి అలాగే దాహంతో ఉన్న బాటసారి తన దప్పిక తీర్చాలని పది మందికి సేవ చేయాలని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం అని ఈ.రాములు గారు అన్నారు, ఈ ప్రధాన కూడలి నాలుగు రోడ్లు ఎల్బీనగర్ టు హయత్ నగర్ మరియు ఎల్బీనగర్ టు ఉప్పల్, ఎల్బీనగర్ టు మహబూబ్నగర్ అలాగే ఎల్బీనగర్ టు కోటి బస్టాండ్ కు వెళ్లే ప్రధాన కూడలి కావడం సంతోషించ విషయం అందులో ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి తమ దాతృత్వాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు చాటుకున్నారు ఈ రోజుల్లో ఒక చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అంత మామూలు విషయం కాదు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఈ భారాన్ని మోయాల్సి ఉంటుంది, నాలుగు నెలలు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రతినిధులకే దక్కుతుందనీ ఫౌండేషన్ ప్రతినిధులను వచ్చిన పలువురు అతిథులు హర్షించారు. మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ..ఈ చలివేంద్రం మా ఒక్కరి కోసం కాకుండా పదిమందికి సేవ చేయాలనే సంకల్పంతో ఈ ఎల్బీనగర్ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడం జరిగిందని దీని వెనకాల ప్రతి ఒక్కరి కృషి ఉందని ఈ ఫౌండేషన్ ప్రారంభం చేసిన అతిరథ మహారధులకు ఫౌండేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఆనందం అడిషనల్ ఎస్పీ రిటైర్డ్, ఈ రాములు టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ, జగదీశ్వర్ రెడ్డీ PJR కోచింగ్ సెంటర్ డైరెక్టర్, మహమ్మదాబాద్ మండల యువజన కాంగ్రెస్ నాయకులు ఈ పవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ అప్పగల్ల నర్సిములు, మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ అధ్యక్షులు సి.దస్తయ్య, వైస్ ప్రసిడెంట్ మండల డానియల్, ప్రధాన కార్యదర్శి ఆనపోసల రామస్వామి, అణ్వేష నేత్రం ఎడిటర్ గోళ్ళ రమేష్, ధర్మ గంట ఎడిటర్ శాంతయ్య. నేటి న్యాయం చీఫ్ ఎడిటర్ డి.వెంకట రమణ, కదారి శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్టు, శేఖర్ జర్నలిస్టు, రాజేష్, చంద్రగిరి సత్యనారాయణ టీజేఎస్ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు. pacs ఛైర్మెన్ గట్ల కేశవరెడ్డి, scrps స్టేట్ యూత్ వింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగం మహేశ్, వెంకటేష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసుల అదుపులో షకీల్

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 10:

వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. కేసులు నమోదు అయినప్పటి నుంచి ఆయన దుబాయ్‌లో ఉంటున్నారు. తల్లి చనిపోవడంతో హైదరాబాద్ వచ్చిన షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. తల్లి చనిపోవడంతో ఆయన దుబాయ్ నుంచి వచ్చారు. వచ్చిన వెంటనే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో షకీల్‌ను హైదరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అయితే తల్లి అంత్యక్రియలు పూర్తి చేయాల్సి ఉందని చెప్పడంతో దానికి అనుమతి ఇచ్చినట్టు చెబుతున్నారు. తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత ఆయనపై చాలా కేసులు నమోదు అయ్యాయి. వాటిలో అరెస్టు తప్పదని గ్రహించి దుబాయ్ వెళ్లిపోయారు. దుబాయ్‌లో ఉన్న షకీల్‌పై పోలీసులు అరెస్టు వారెంట్, లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించిన షకీల్‌ను రప్పించలేకపోయారు. అయితే ఇంతలో అనారోగ్యంతో తల్లి మృతి చెందారు. షకీల్ రాక తప్పలేదు. వచ్చిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షకీల్ కుమారుడు కూడా హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. షకీల్ కుమారుడు రాహిల్ ఆమిర్ 2022లో జూబ్లీహిల్ జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో శిశువు చనిపోయాడు. తర్వాత 2023 డిసెంబర్‌లో కూడా అలాంటి ప్రమాదం జరిగింది. ప్రజాభవన్ ముందు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీ కొట్టి వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తే సంబంధం లేని వ్యక్తులను అందులో ఇరికించేందుకు యత్నించినట్టు కూడా ఆరోపణలు ఉన్నాయి. కొందరు పోలీసులతో కుమ్మక్కై అతన్ని తప్పించారని విచారణలో తేలింది. హిట్ అండ్ రన్ కేసులో కుమారుడిని తప్పించడంలో షకీల్‌దే కీలక పాత్ర అని పోలీసులు అనుమానించారు. ఈ దిశగానే కేసును విచారించారు. కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు ఆయన పాత్రను కన్ఫామ్ చేశారు. కేసు నమోదై విచారణ సాగతున్న టైంలోనే షకీల్ కూడా దుబాయ్ పారియారు. పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకోవడానికి తండ్రీకుమారుడు దుబాయ్‌లో తలదాచుకున్నారు. షకీల్ పూర్తి పేరు మొహమ్మద్ షకీల్ ఆమిర్. బీఆర్ఎస్ తరపున పోటీ చేసి 2014, 2018 రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. అప్పటి కాంగ్రెస్ అబ్యర్థి సుదర్శన్ రెడ్డిపై విజయం సాధించారు. తర్వాత 2024 ఎన్నికల్లో మాత్రం అదే సుదర్శన రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు.

06

ప్రభాత
జయభేరి
సినిమా
11-04-2025
శుక్రవారం
jayabheridaily.com



## టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న
# రవితేజ కూతురు..

సినీ పరిశ్రమకి వారసుల తాకిడి కొత్తేమి కాదు. ఇప్పటికే సినీ పరిశ్రమకి చెందిన హీరోలు, దర్శకులు, నిర్మాతల వారసులు ఇండస్ట్రీకి వచ్చి సత్తా చాటుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మాస్ మహరాజా రవితేజ కూతురు కూడా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. రవితేజ కూతురు మోక్షద భూపతిరాజు త్వరలో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు తెలుస్తోంది. అయితే ఆమె నటిగా ప్రేక్షకులను అలరించడం లేదు కాని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వర్క్ చేయనున్నట్టు సమాచారం. 22 ఏళ్ళు ఉన్న మోక్షద భూపతిరాజు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ సితార ఎంటర్టైన్మెంట్ స్ బ్యానర్లో ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న ఒక అన్ టైటిల్ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వర్క్ చేస్తున్నారంట. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించనున్నాడట. అలానే మూవీకి వినోద్ అనంతోజు దర్శకత్వం వహించనున్నారని అంటున్నారు. నటిగా కాకుండా తెర వెనక ఉండి తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ముఖ్య పాత్ర పోషించడానికి మోక్షద ప్రయత్నాలు చేస్తుందని తెలిసి రవితేజ అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇప్పటికే రవితేజ తన సొంత బ్యానర్ ఆర్టీ టీమ్ వర్క్స్ లో పలు సినిమాలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. గట్ట కుస్తీ, రావణాసుర, చాంగురే బంగారు రాజా, సుందరం మాస్టర్.. వంటి సినిమాలను నిర్మించడం మనం చూశాం.. అయితే ఇప్పుడు ప్రొడ్యూసర్ గా మోక్షద అనుభవం సంపాదిస్తుండడంతో రాబోయే రోజులలో రవితేజ కూతురు ఆ బ్యానర్ లో నిర్మించబోయే సినిమాలను దగ్గరుండి చూసుకుంటుందేమో అని ముచ్చటించుకుంటున్నారు.

## పోలీస్ స్టేషన్‌లో దెయ్యం



ఒకప్పుడు కల్ట్ మూవీస్‌తో తెలుగు, హిందీ భాషల్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన అగ్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ గత కొంతకాలంగా రేసులో వెనకబడ్డారు. ఆయన స్థాయికి తగిన సినిమాలు రావడం లేదని అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్జీవీ ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌తో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ఇందులో మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్రలో నటించనున్నారు. తాను ఇప్పటివరకు హారర్, గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్, పొలిటికల్ డ్రామాస్, అడ్వెంచర్ థ్రిల్లర్స్ చేశానని, కానీ కెరీర్‌లో తొలిసారి హారర్ కామెడీ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నానని రామ్‌గోపాల్‌వర్మ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఈ సినిమాకు 'పోలీస్‌స్టేషన్ మే భూత్' అనే టైటిల్ ఖరారు చేశానని..'యూ కాంట్ కిల్ ది డెడ్' అన్నది ట్యాగ్‌లైన్ అని ఆయన తెలిపారు. 'మనకు భయమేస్తే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తాం. కానీ పోలీసులే భయపడే పరిస్థితి వస్తే వాళ్లు ఎక్కడకు పోతారు?' అన్నదే ఈ సినిమా కాన్సెప్ట్. ఓ భయంకరమైన ఎన్‌కౌంటర్ తర్వాత పోలీస్‌స్టేషన్ హాంటెడ్ స్టేషన్‌గా మారుతుంది. చనిపోయిన గ్యాంగ్‌స్టర్స్ దెయ్యాలుగా మారి పోలీసులను ఇబ్బంది పెడుతుంటారు. ఇదే సినిమా కథాంశం. ఇందులో వీఎఫ్ఎక్స్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది' అని వర్మ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.




# మామతో ఆ యవ్వారం..

ఓటీటీల జోరు కొనసాగుతోంది. సూపర్ హిట్ సినిమాలు, క్రేజీ వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకులు విపరీతంగా ఎంజాయ్ చేస్తున్నారు. కొత్త సినిమాలను థియేటర్స్‌లో చూస్తూ.. అలాగే రిలీజ్ అయిపోయిన సినిమాలను ఓటీటీలో ఎంజాయ్ చేస్తున్నారు ప్రేక్షకులు. ఇక ఓటీటీ లవర్స్‌ను ఆకట్టుకునేలా రకరకాల సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఓటీటీలో రిలీజ్ అయ్యి ఆకట్టుకుంటున్నాయి. ఇక హారర్, రొమాంటిక్, థ్రిల్లర్ మూవీస్‌కు మంచి క్రేజ్ ఉంది. వివిధ ఓటీటీ సంస్థలో చాలా రకాల సినిమాలు స్ట్రీమింగ్ అవుతున్నాయి. ఇక రొమాంటిక్ సినిమాలకు సపరేట్ ఫ్యాన్స్ ఉంటారు. ఇక ఓటీటీలో ఇప్పటికే చాలా రకాల రొమాంటిక్ సినిమాలు ఓటీటీల్లో ఉన్నాయి. ఇక ఇప్పుడు ఓ ఇంట్రెస్టింగ్ రొమాంటిక్ మూవీ సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. ఈ రొమాంటిక్స్ సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ నటించింది. ఈ సినిమాలో బోల్డ్ సీన్స్ కు కొదవే లేదు.. ఈ సినిమాలోని రొమాంటిక్ సీన్స్ పెద్ద వివాదాన్ని సృష్టించింది. ఎన్నో విమర్శలు ఎదుర్కొంది ఈ సినిమా. మహిళా సంఘాలు కూడా ఈ సినిమా పై మండిపడ్డాయి. అంతే కాదు డైరెక్టర్ ను చితకొట్టుడు కొట్టారు కూడా.. ఈ సినిమా పేరు సింధు సామవేలి. ఈ సినిమా సుందర్ అనే యువకుడి చుట్టూ జరుగుతుంది. అతను తన భార్య సింధుతో కలిసి సాధారణ జీవితం గడుపుతుంటాడు. అయితే, సుందర్ తన తండ్రితో కలిసి ఉండాల్సి వస్తుంది. అయితే కొడుకు చదువు నిమిత్తం విదేశాలకు వెళితే ఎక్స్ మిలిటెంట్ అయిన తండ్రి కోడలితో అక్రమ సంబంధం పెట్టుకోవడం ఈ సినిమా కథాంశం.. కోడలిని లొంగదీసుకునే మామ అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందింది. దాంతో ఈ సినిమా పై పెద్దెత్తున విమర్శలు వచ్చాయి. కాగా ఈ సినిమాలో నటించిన హీరోయిన్‌గా అమలాపాల్ నటించింది. ఈ సినిమాలో బోల్డ్ సన్నివేశాలకు కొదవేలేదు. కాగా ఈ సినిమా విడుదలైన తర్వాత ఈ సినిమా దర్శకుడు స్వామి, హీరోయిన్ అమలాపాల్ పై కూడా దాడి జరిగింది. గతంలో ఈ సినిమా గురించి అమలాపాల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కెరీర్ బిగినింగ్ లో ఆ సినిమా చేసి తప్పు చేశానని.. ఆ సినిమా తన జీవితం పై ప్రభావం చూపిందని తెలిపింది. ఆ సినిమా సమయంలో తనకు కేవలం 17 ఏళ్లు మాత్రమే అని ఆ సమయంలో తనపై కూడా దాడి జరిగిందని తెలిపింది అమలాపాల్. ఈ సినిమా ఇప్పుడు యూట్యూబ్ లో ఫ్రీగా చూడొచ్చు.



# ఓపినింగ్స్ కూడా కమిట్మెంట్..

ఇప్పుడిప్పుడే హీరోయిన్స్ గా ఎదుగుతున్న వారిలో ఎస్తేర్ నోరోన్హా ఒకరు. సునీల్ హీరోగా నటించిన భీమవరం బుల్లోడు సినిమాలో ఎస్తేర్ నోరోన్హా హీరోయిన్ గా నటించింది. ఆ తర్వాత పలు సినిమాల్లోనూ హీరోయిన్ గా చేసింది ఈ అమ్మడు. ఈ చిన్నది వేయి అబద్ధాలు సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఈ సినిమా తర్వాత సునీల్ తో సినిమా చేసింది. బబ్లీ గా ఉండే ఈ బ్యూటీ తన నటనతో పాటు అందంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. చేసింది తక్కువ సినిమాలే అయినా ప్రేక్షకులకు బాగా నచ్చేసింది ఈ అమ్మడు. కాకపోతే ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో హీరోయిన్ గా ఛాన్స్ లు తగ్గిపోయాయి. ఆతర్వాత సింగర్ నోయల్ ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత ఈ ఇద్దరూ విడిపోయారు. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఎస్తేర్ నోరోన్హా మాట్లాడుతూ షాకింగ్ కామెంట్స్ చేసింది. హీరోయిన్ గా ఎదగాలంటే చెడ్డ దారిలో వెళ్లి త్వరగా స్టార్ అవ్వొచ్చు.. కానీ నాకు అది ఇష్టం లేదు. చాలా మంది హీరోయిన్స్ లా నేను కూడా కమిట్మెంట్ కు ఒప్పుకొని ఉంటే పెద్ద హీరోయిన్ అయ్యేదాన్ని.. ఇక్కడ షాపింగ్ మాల్ ఓపెన్ చేయాలన్నా కూడా కమిట్మెంట్ అడుగుతారు. షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవానికి కూడా కమిట్మెంట్స్ అడుగుతారు అందుకే నేను వాటికి దూరంగా ఉంటున్నాని తెలిపింది ఎస్తేర్.





# మార్క్ శంకర్ మా ఇంటికొచ్చేశాడు..

సింగపూర్ స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన రోజున చేతులకి, కాళ్లకి గాయాలు కావడంతో పాటు పొగ ఊపిరి తిత్తుల్లోకి చేరడంతో శ్వాస పీల్చుకోవడానికి మార్క్ శంకర్ కాస్త ఇబ్బంది పడ్డాడు.

అయితే మార్క్ శంకర్‌కి జరిగిన ఈ ప్రమాదం గురించి తెలుసుకొని పవన్ కళ్యాణ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా చాలా కంగారు పడ్డారు. పవన్ కళ్యాణ్, మెగాస్టార్ చిరంజీవి దంపతులు హుటాహుటిన సింగపూర్ వెళ్లారు. మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులని అడిగి తెలుసుకున్నారు.

మార్క్ శంకర్ ఊపిరి తిత్తుల్లోకి చేరిన పొగను..బ్రాంకోస్కోప్ ద్వారా బయటకు పంపేసినట్లుగా తెలుస్తుండగా, ప్రస్తుతం మార్క్ శంకర్ క్షేమంగా ఉన్నాడని మెగాస్టార్ చిరంజీవి ట్వీట్ చేశారు. మా బిడ్డ మార్క్ శంకర్ ఇంటికొచ్చేసాడు. అయితే ఇంకా కోలుకోవాలి. మా కులదైవమైన ఆంజనేయ స్వామి దయతో, కృపతో త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో, మళ్ళీ మామూలుగా ఎప్పటిలానే ఉంటాడు అని చిరంజీవి తన ట్వీట్‌లో పేర్కొన్నాడు. ఈ విషయం తెలిసాక పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆ దేవుడి దయ వలన మార్క్ శంకర్ త్వరగానే కోలుకున్నాడని ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇక పవన్ కుమారుడికి ప్రమాదం జరిగిందని తెలిసిన తర్వాత దాదాపుగా అందరూ స్పందించారు. మార్క్ శంకర్ కోలుకోవాలని సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ప్రార్థించారు. వైసీపీ అధినేత జగన్, రోజా కూడా.. పవన్ కు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. అయితే జనసేన పార్టీ వ్యతిరేకులు కూడా మంచి మనసుతో స్పందించడం చూశాక రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ఉండకుండా.. ఇలాంటి సుహృద్భావ వాతావరణం ఉంటే ఎంత బాగుంటుందో కదా అనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ కూడా అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com